సాక్షి ఖమ్మం

శనివారం । 30 । ఆగస్టు । 2025



మరింత గుర్తింపునిచ్చేలా..
అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు యూనిఫామ్ పంపిణీ చేయనుండగా.. టీచర్లు, ఆయాలకు చీరలు ఇవ్వనున్నారు. 8లో



..ఎన్నికలకు సహకరించాలి
స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం
జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరిగే అవకాశముంది. సాయంత్రం తర్వాత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

జిల్లాకు 50 ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు



మాట్లాడుతున్న డీఎంఓ అలీం

నేలకొండపల్లి: జిల్లాలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 50 ఆటోమేటిక్ క్లీనర్లు మంజూరయ్యాయని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం తెలిపారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేసిన ఆయన శనివారం నిర్వహించనున్న ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్ల అవగాహన సదస్సుపై సమీక్షించారు. ఈసందర్భంగా అలీం మాట్లాడుతూ ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్ల వినియోగంపై శనివారం అన్ని మార్కెట్ల కార్యదర్శులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. కాగా, తొలిసారి నేలకొండపల్లి మార్కెట్‌కు డ్రయ్యర్ మంజూరు కాగా, మిగతా మార్కెట్లకూ అందిస్తామని చెప్పారు. గత సీజన్‌లో ఏర్పాటుచేసిన 232 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తోడు ఈసారి మరో 50 కేంద్రాలు పెంచే అవకాశముందని తెలిపారు. జిల్లాలోని మార్కెట్ కమిటీల ద్వారా ఈ ఏడాది రూ.69 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుని ఇప్పటికే రూ.15 కోట్లు వసూలుచేశామని డీఎంఓ చెప్పారు. కాగా, కొత్తగా మంజూరైన మత్కేపల్లి మార్కెట్ ఏర్పాటుకు స్థలం పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు.

వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉద్యోగినుల వసతి గృహంలో ప్రవేశాలకుదరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కీసర రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న మహిళలు అర్హులని, 18 - 40 ఏళ్ల వయస్సు కలిగి ఆర్థికంగా వెనుకబడిన వారై ఉండాలని తెలిపారు. ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న వారు సైతం అర్హులేనని వెల్లడించారు. పుట్టిన తేదీ, ఉద్యోగ ధ్రువపత్రం, శిక్షణ తరగతికి చెందిన పత్రం, వేతన సర్టిఫికెట్లతో ఖమ్మం పాత డీఆర్‌డీఏ కార్యాలయం సమీపాన వసతి గృహంలో దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 79010 17341 నంబర్‌లో సంప్రదించాలని డీడబ్ల్యూఓ సూచించారు.

నవోదయ దరఖాస్తుల సవరణకు అవకాశం

కూసుమంచి: మండలంలోని పాలేరులో జవహర్ నవోదయ విద్యాలయలో 2026–27 విద్యా సంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. అయితే, దరఖాస్తుల్లో ఏమైనా తప్పులు ఉంటే సవరణకు శనివారం చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఎడిట్ ఆప్షన్ ద్వారా అభ్యర్థి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, కులం, చిరునామా, పాఠశాల వంటి వివరాల్లో తప్పులు దొర్లితే సరిచేసుకునే అవకాశముందని వెల్లడించారు.

సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఈ శ్రీనివాసాచారి

ఖమ్మంవ్యవసాయం: ప్రధాన మంత్రి కుసుమ్ పథకం ద్వారా వ్యవసాయ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న రైతులతో శుక్రవారం ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సందేహాలను నివృత్తి చేశాక మాట్లాడారు. వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసే ప్లాంట్ల నుంచి సమీపంలోని సబ్ స్టేషన్ వరకు 11 కేవీ లైన్ వేయాల్సి ఉంటుందని తెలిపారు. రైతులు వ్యక్తిగతంగా లేదా సమూహాలుగానే కాక ఇతర డెవలపర్లకు సైతం అవకాశముందని చెప్పారు. ఈ సమావేశంలో రైతులతో పాటు లీడ్ బ్యాంక్, రెడ్కో మేనేజర్, ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

22నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు సెప్టెంబర్ 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్, డీఈఓ పి.శ్రీజ వెల్లడించారు. అలాగే, ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబర్ 6నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఉదయం సెషన్ 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2–30గంటల నుంచి 5–30గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

భారమైనా తప్పడం లేదు..





తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులోని పత్తి చేను

యూరియాకు ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ ఎరువులు

- సరిపడా లభ్యత లేక రైతుల చూపు
- అయినా ఫలితంపై భిన్నాభిప్రాయాలు
- అధిక వర్షాలతో ఎర్రబారుతున్న పత్తి, దుబ్బు దశలో వరి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వరి పొలాలు దుబ్బు చేసే సమయం.. ఇంకోపక్క అధిక వర్షాలతో పత్తి పంట ఎర్రపడింది. ఈ పరిస్థితుల్లో పంటలు ఆరోగ్యకంగా పెరిగేలా యూరియా తప్పనిసరి కాగా, జిల్లాలో లభ్యత లేక రైతులు విధిలేని పరిస్థితుల్లో కాంప్లెక్స్ ఎరువుల వైపు మొగ్గు చూపుతున్నారు. యూరియా బస్తా ధర సబ్సిడీ పోగా రూ.260 ఉండగా.. కాంప్లెక్స్ ఎరువు బస్తా ధర రూ.1,300 నుంచి రూ.1,700 పలుకుతోంది. ఇది భారమైనప్పటికీ తప్పని పరిస్థితుల్లో రైతులు కొనుగోలు చేస్తున్నారు

దుకాణాల వద్ద క్యూలు, ధర్నాలు

పంటలకు అవసరమైన సమయాన యూరియా కొరత రైతులను వేధిస్తోంది. దుకాణాల వద్ద పడిగాపులు కాయడమే కాక ఆందోళనకు దిగుతున్నారు. అయినా రేషన్ విధానంలో ఒకటి, రెండు బస్తాలే ఇస్తున్నారు. యూరియా వాడకంతో పంటల పూత, కాత వృద్ధితో పాటే దిగుబడి పెరుగుతుంది. వరి నాట్లు వేశాక 2 – 3 సార్లు యూరియా వాడతారు. ఇక పత్తిలో పొటాష్, యూరియా కలిపి వేస్తారు. మరోపక్క గుళికల యూరియాకు బదులు ద్రవరూపంలోని నానో యూరియా వాడాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఎక్కువ మంది ముందుకు రావడం లేదు.

18వేల మెట్రిక్ టన్నులే...

జిల్లాలో యూరియా అవసరం ఉన్నంత కాకున్నా.. ప్రభుత్వం చెప్పిన మేర కూడా సరఫరా కావడం లేదు. ఈ వానాకాలంలో ఆగస్టు వరకు 32,441 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేసినా 19,764 మెట్రిక్ టన్నుల సరఫరాకే నిర్ణయించారు. ఇందులో 18,477 మెట్రిక్ టన్నులే సరఫరా చేయడం గమనార్హం. ఇక సెప్టెంబర్‌లో 22,384 మెట్రిక్ టన్నులు సరఫరా చేయాల్సి ఉండగా.. దీన్ని 21,236 మెట్రిక్ టన్నులకు కుదించారు. ఇది కూడా వస్తుందో, రాదో తెలియడం లేదు.

వీటితో ఇబ్బందే..

రైతులు యూరియా కొరత నేపథ్యాన ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ ఎరువులపై మొగ్గు చూపుతున్నారు. కానీ వీటితో ఫలితం ఆశాజనకంగా ఉండదనే ప్రచారం ఉంది. పంటలు పెరిగే దశలో యూరియా అవసరమవుతుంది. ఇక కాంప్లెక్స్ ఎరువుల్లో యూరియాతోపాటు పొటాష్ వంటివి కూడా ఉండగా.. వీటి అవసరం లేకున్నా వాడడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నానో యూరియా ఫలితాలపైనా రైతులు పెదవి విరుస్తున్నారు. వరి సాగులో 40 – 50 రోజుల వరకు పలు దఫాలు యూరియా వాడాల్సి ఉంటుంది. ఈక్రమాన కాంప్లెక్స్ ఎరువుల వాడకం సరికాదనే వాదన ఉంది. ఇక 40రోజుల తర్వాత పంటలకు కాంప్లెక్స్ ఎరువులు వాడితే ఉపయోగం ఏ మాత్రం ఉండదని చెబుతున్నారు.

జిల్లాకు అవసరమైన యూరియా, సరఫరా వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

అవసరం	54,825
సరఫరా అంచనా	41,000
సరఫరా చేసింది	18,477
సరఫరా చేయాల్సింది	22,523
సెప్టెంబర్‌లో అవసరం	21,236

కాంప్లెక్స్ ఎరువులే దిక్కు

అసలే పెట్టుబడి భారమవుతున్న వేళ రైతులకు యూరియా కొరత మరో భారాన్ని మోపింది. ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ ఎరువులపై దృష్టి సారిస్తే ఈ ఎరువుల ధర ప్రభుత్వ సబ్సిడీ మినహాయిస్తే రూ.1,300 నుంచి రూ.1,700 వరకు ఉంది. అయినా తప్పని పరిస్థితుల్లో వాడేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. యూరియాలో 46 శాతం నత్రజని ఉంటే, కాంప్లెక్స్ ఎరువులైన 15–15–15–9లో నత్రజని, పొటాష్, ఫాస్పేట్ 15 శాతం చొప్పున ఉంటాయి. వీటిల్లో యూరియా అమ్మోనియం ఫాస్పేట్ రూపంలో ఉంటుంది.

'కాంప్లెక్స్'తో మరింత ఖర్చు



ఆరెకరాల్లో పత్తి, రెండెకరాల్లో వరి సాగు చేశా. ప్రస్తుతం యూరియా అవసరముంటే సొసైటీలో ఒక బస్తానే ఇచ్చారు. దీంతో అధిక ధర అయినా కాంప్లెక్స్ ఎరువులు తెచ్చి వేస్తుండగా భారం పడుతోంది. ప్రభుత్వం సరిపడా యూరియా అందిస్తేనే మా కష్టాలు తీరతాయి.

– కుంట వెంకటేశ్వర్లు, ఎడుళ్ల చెరువు, తిరుమలాయపాలెం మండలం

వరదలతో దెబ్బతిన్న రహదారులు



ఖమ్మం - బోనకల్ మార్గంలో వరదతో దెబ్బతిన్న రహదారి

ఖమ్మంఅర్బన్: జిల్లాలో వరుస వర్షాలు, వరదలతో అర్‌అండ్‌బీ రహదారులు, వంతెనలు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఈమేరకు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తిస్తున్న అధికారులు అత్యవసర మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఖమ్మం–బోనకల్ రహదారిపైకి భారీగా వరద చేరడంతో రెండు చోట్ల రోడ్డు కోతకు గురైంది. అలాగే, బోనకల్, తిరుమలాయపాలెం, వైరా, చింతకాని, కొణిజర్ల మండలాల్లోనూ రోడ్లు దెబ్బతిన్నాయని గుర్తించారు. వాగులపై ఉన్న వంతెనల వద్ద కూడా కోతకు గురికాగా అత్యవసర మరమ్మతులకు రూ.కోటికి పైగా అవసరమని అంచనా వేసినట్లు తెలిసింది.

కలెక్టర్లతో మంత్రి తుమ్మల సమీక్ష

భారీ వర్షాల ప్రభావంతో గోదావరి, మున్నేటికి వరద పెరుగుతున్న నేపథ్యాన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లతో ఫోన్‌లో సమీక్షించారు. భద్రాచలం వద్ద గోదావరి, చర్ల మండలంలో తాలిపేరు ప్రాజెక్టు ఉధృతి పెరుగుతున్నందున పరీవాహక ప్రజలను అప్రమత్తం చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను ఆదేశించారు. మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లాలో మున్నేటి వరద పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మంత్రి ఆదేశించారు.

చెక్‌పోస్టులకు మంగళం!

- ఉమ్మడి జిల్లాలో మూడింటి ఎత్తివేత
- 40 ఏళ్ల నాటి పాల్వంచ చెక్‌పోస్ట్ సైతం మూత

ఖమ్మంక్రైం: రాష్ట్ర సరిహద్దుల్లో అన్నిరకాల చెక్‌పోస్టులను ఎత్తివేస్తున్నట్లు రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్ తాజాగా వెల్లడించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఉత్తర్వులు అందినట్లు తెలిసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మూడు చెక్‌పోస్ట్‌ల తొలగింపునకు రవాణా శాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

వరుస ఆరోపణలతో...

ఇతర రాష్ట్రాలకు సరుకులు తీసుకెళ్లే వాహనాలకు నేషనల్ పర్మిట్ లేకపోతే పన్ను వసూళ్ల కోసం చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ఆయా చెక్‌పోస్టుల్లో ఏడు, 15, 30రోజుల పరిమితితో తాత్కాలిక పర్మిట్లు జారీ చేసేవారు. అయితే, చెక్‌పోస్ట్‌ల్లో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడం.. ఏసీబీ తనిఖీల్లో నిజమేనని తేలడంతో ప్రభుత్వం వీటి తొలగింపునకు నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ముత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, అశ్వారావుపేటలోని చెక్‌పోస్టులను ఎత్తివేయనున్నారు. ఇందులో పాల్వంచ చెక్‌పోస్టు 40ఏళ్ల క్రితం ఏర్పాటు కాగా, అశ్వారావుపేట, ముత్తగూడెం చెక్‌పోస్టులు తెలంగాణ ఆవిర్భవించాక ఏర్పాటయ్యాయి.

సిబ్బంది ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు...

చెక్‌పోస్ట్‌లు తొలగించనుండడంతో అందులోని సిబ్బందిని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి బదిలీ చేయనున్నారు. ముత్తగూడెం చెక్‌పోస్ట్‌లో ఒక ఎంవీఐ, ఏఎంవీఐ, పాల్వంచలో ఒక ఏఎంవీఐ, అశ్వారావుపేటలో ఒక ఎంవీఐ, ఏఎంవీఐ విధులు నిర్వర్తిస్తుండగా వీరు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేయనున్నారు. కాగా, చెక్‌పోస్ట్‌ల ఎత్తివేతపై ఉత్తర్వులు అందినా తేదీపై స్పష్టత లేదని రవాణా శాఖ అధికారులు వెల్లడించారు.

ఇందిరమ్మ బిల్లు మరొకరి ఖాతాలో!

నగదు ఇవ్వాలంటే ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్

కామేపల్లి: ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో కొందరు సిబ్బంది తీరు కారణంగా లబ్ధిదారులకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. కామేపల్లి మండలం జగన్నాథతండా జీపీ పరిధి రేపల్లెవాడకు చెందిన తేజావత్ రవికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దీంతో ఆయన నెలన్నర క్రితం పునాది పూర్తయ్యాక జీపీ కార్యదర్శికి సమాచారం ఇచ్చాడు. ఈమేరకు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రోజులు గడుస్తున్నా బిల్లు మంజూరు కాలేదు. ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే జమ అయినట్లు చూపిస్తుండగా ఆరా తీయడంతో అదే గ్రామానికి చెందిన తేజావత్ రవి పేరుతో ఉన్న మరో వ్యక్తి ఖాతాలో ఈనెల 11న రూ.లక్ష జమ అయినట్లు తేలింది. ఈ విషయమై కార్యదర్శి అడిగితే నగదు ఇవ్వడానికి సదరు వ్యక్తి తనకు కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఇందిరమ్మ కమిటీ దృష్టికి తీసుకెళ్లి వారితో అడిగిస్తే అనర్హులకు ఇళ్లు కేటాయించారని వాపోయినట్లు సమాచారం. ఇదంతా ఎటూ తేలక ఇల్లు నిర్మిస్తున్న రవి మాత్రం అధికారులు, నాయకుల చుట్టూ తిరుగుతున్నాడు. అయితే, లబ్ధిదారుల జాబితాను జీపీ కార్యదర్శికి ఇవ్వాల్సి ఉండగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపీడీఓ కార్యాలయంలో ఆపరేటర్‌తో నేరుగా ఆన్‌లైన్ చేయించడంతోనే సమస్య ఉత్పన్నమైనట్లు తెలుస్తోంది. ఈవిషయమై ఎంపీడీఓ రవీందర్‌ను వివరణ కోరగా.. లబ్ధిదారుడికి బదులు ఇంకో వ్యక్తి ఖాతాలో నగదు జమ అయిన విషయం తెలిసిందని చెప్పారు. జీపీ కార్యదర్శి ప్రస్తుతం ప్రసూతి సెలవులో ఉన్నందున ఇందిరమ్మ కమిటీ సభ్యులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

కులగణన ఆపరేటర్లకు గౌరవ వేతనం

- జిల్లాకు రూ.1.50 కోట్లు విడుదల

నేలకొండపల్లి: గత ఏడాది చేపట్టిన కుల గణన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇన్నాళ్ల తర్వాత గౌరవ వేతనం అందింది. ఒక దరఖాస్తు నమోదు చేస్తే ప్రభుత్వ ఆపరేటర్లకు రూ.14, ప్రైవేట్ ఆపరేటర్లకు రూ.30 చెల్లిస్తామని అప్పట్లో తెలిపారు. జిల్లాలో 5,04,263 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా.. వేతనం కోసం వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయారు. ఇప్పుడు గౌరవ వేతనంగా రూ.1,50,79,090 కోట్లను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల ఖాతాల్లో శుక్రవారం జమ చేశారు. ఈ నిధులను వారు ఆపరేటర్లకు చెల్లించనున్నారు.

పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం



మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ అనుదీప్ తదితరులు

- 7లక్షల రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత మాదే..
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క తెల్లరేషన్ కార్డు కూడా ఇవ్వకపోగా.. తాము అధికారంలోకి వచ్చాక 7లక్షల మందికి కొత్తగా తెల్ల రేషన్ కార్డులను అందించామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అంతేకాక 17లక్షల మంది పేర్లను చేర్చామని వెల్లడించారు. కూసుమంచి మండలంలోని పాలేరు, మల్లాయిగూడెం, లింగారం తండా, జీళ్లచెరువు గ్రామాల్లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే, జీళ్లచెరువు పాఠశాల విద్యార్థినులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సైకిళ్లను పంపిణీ చేయగా, తొలుత కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి గీత కార్మికులకు కాటమయ్య కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ పేదలు సన్నబియ్యం తినాలనే లక్ష్యంతో ప్రభుత్వంపై భారం పడినా రేషన్ షాపుల్లో సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. కాటమయ్య కిట్లతో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా వృత్తి నిర్వర్తించొచ్చని చెప్పారు. కాగా, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామని మంత్రి స్పష్టం చేశారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ కాటమయ్య కిట్లు గీత కార్మికులకు శ్రీరామ రక్షగా నిలుస్తాయని తెలిపారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి జ్యోతి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఆర్డీఓ నరసింహారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాంచందర్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జెన్‌కో అధికారులపై ఆగ్రహం

పాలేరులోని మినీ జల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ అనుదీప్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు యూనిట్లలో ఒక యూనిట్ బేరింగ్ లేనందున ఉత్పత్తి జరగడం లేదని, ఒక యూనిట్ మాత్రమే పనిచేస్తుందని చెప్పడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటీవలే ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టి ఉత్పత్తి మొదలుపెట్టగా, ఇరవై రోజుల్లోనే మరమ్మతుకు రావటం ఏమిటని ప్రశ్నించారు. పూర్తి వివరాలతో హైదరాబాద్ రావాలని ప్రాజెక్టు ఎస్‌ఈని ఆదేశించారు.

నిరంతరం సంక్షేమ పథకాలు

ఖమ్మంరూరల్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూనే సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని, అర్హులందరికీ లబ్ధి జరిగే వరకు సంక్షేమ పథకాలు కొనసాగుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం చిన్నవెంకటగిరిలో సబ్ స్టేషన్, చింతపల్లిలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి మాట్లాడారు. వెంకటగిరి ప్రాంతంలో రూ.2.55 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణం జరుగుతోందని, రూ.2.15 కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని వెల్లడించారు. అనంతరం 55మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, ఆర్‌డీఓ నర్సింహారావు, తహసీల్దార్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో క్రీడలు భాగం కావాలి



3కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఐఈఓ, డీవైఎస్‌ఓ తదితరులు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- క్రీడాదినోత్సవం సందర్భంగా 3కే రన్

ఖమ్మం స్పోర్ట్స్: అందరి జీవితాల్లో క్రీడలు భాగం కావాలని.. తద్వారా ఉన్నత స్థానాలకు చేరడమే కాక జిల్లా ఖ్యాతి పెరుగుతుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం వద్ద 3కే రన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని, ఇందుకోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం సొంతమై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. తొలుత మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కలెక్టర్ అనుదీప్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించారు. అలాగే, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, ఇంటర్ విద్యాశాఖాధికారి రవిబాబు, క్రీడా అసోసియేషన్ల బాధ్యులు, ఉద్యోగులు కె.క్రిస్టోఫర్‌బాబు, ఎస్.రాధాకృష్ణ, బాలసాని విజయ్, ఎస్.ఉప్పల్‌రెడ్డి, గోవిందారెడ్డి, వి.శ్రీనివాసరావు, జె.శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, ఎం.డీ.గౌస్, పరిపూర్ణాచారి, సురేష్, వి.సాంబమూర్తి, నగేష్, కొండల్‌రావు, కైలాష్, సత్యం, దుర్గ పాల్గొన్నారు. కాగా, పటేల్ స్టేడియం వద్ద మొదలైన 3కే రన్ ఇల్లెందు క్రాస్ రోడ్డు, కోర్టు మీదుగా వీఆర్‌కే సిల్క్స్ వరకు కొనసాగింది. క్రీడాకారులు, యువత, సీనియర్ సిటిజన్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గణనాథుడికి కరెన్సీతో అలంకరణ

సత్తుపల్లి అవని వెంచర్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడు శుక్రవారం లక్ష్మీగణపతిగా దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వామిని రూ.29.50 లక్షల కరెన్సీ నోట్ల మాలలతో అలంకరించారు. రూ.50, రూ.100, రూ.200, రూ.500నోట్లతో గజమాల, తోరణాలు రూపొందించి మండపం, స్వామికి అలంకరించి పూజలు చేశారు. నిర్వాహకులు దురిశేటి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, అనిల్, ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, వెంకట్, భాస్కర్, అనురాధ, లక్ష్మి, కృష్ణవేణి, అనూష, స్వరూప, రాజేశ్వరి పాల్గొన్నారు. – సత్తుపల్లిటౌన్



క్లుప్తంగా

న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్: కోర్టులను ఆశ్రయించే కక్షిదారులకు న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగేలా కేసుల సత్వర పరిష్కారానికి న్యాయమూర్తులు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సూచించారు. ఇటీవలబాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి అఖిలగౌడ పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోజిల్లా జడ్జి మాట్లాడుతూ బీఫార్మసీ, బీటెక్ చేసిన వారు సైతం న్యాయవాద వృత్తిలోకి వస్తుండడంతో మంచి పరిమాణ మని తెలిపారు. న్యాయమూర్తి అఖిల గౌడ మా ట్లాడుతూ బార్ - బెంచ్ మధ్య మంచి సంబంధాలు కొనసాగిస్తూ కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. న్యాయమూర్తులు అర్చనకుమారి, టి.రాంప్రసాద్‌రావు, మురళీమోహన్, కల్పన, దీప, మాధవి, నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తొండపు వెంకటేశ్వర రావు, గద్దల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత విద్య, వైద్యం



మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు

ఖమ్మం రూరల్: పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచితవిద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పిస్తోందని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంలోని ప్రభుత్వ గిరిజన పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతులు, భోజ నం సరిగా లేకుంటే టోల్‌ఫ్రీ నంబర్ 15100కు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయలక్ష్మి, పీడీ ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘సీతారామ’ భూసేకరణకు గ్రామసభ



మాట్లాడుతున్న ఎస్‌డీసీ రాజేశ్వరి

కామేపల్లి: సీతారామ ఎత్తిపోతల పథకానికి భూసేకరణపై శుక్రవారం కామేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పీసా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన 20 ఎకరాల భూమి సేకరించనున్నట్లు తెలిపారు. ఈమేరకు రైతుల అభిప్రాయాలు సేకరించారు. తహసీల్దార్ సుధాకర్, ఏఓ తారాదేవి పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగులను అభినందించిన సీపీ



పతకాలు అందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా నుంచి పలువురు పోలీసు ఉద్యోగులకు పతకాలు ప్రకటించింది. ఇందులో వైరా ఏసీపీ అబ్దుల్ రెహమాన్‌కు ఉత్తమ సేవా పతకం, ఏఎస్‌ఐలు పి.వెంకటరమణరావు,వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డికి సేవాపతకం, హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ హుస్సేన్‌కు మహోన్నత సేవా పతకం వరించింది. ఈ సందర్భంగా వీరిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం అభినందించి పతకాలు అందజేశారు.

మరింత గుర్తింపునిచ్చేలా..

అంగన్‌వాడీ చిన్నారులకూ యూనిఫామ్

- టెస్కో నుంచి జిల్లాకు చేరిన క్లాత్
- టీచర్లు, ఆయాలకు రెండేసి చీరలు
- విద్యా విలువలు పెంపునకు ప్రభుత్వం కృషి



అంగన్‌వాడీ కేంద్రంలో యూనిఫామ్‌తో చిన్నారులు (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరికొత్త శోభ తీసుకురానుంది. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులతో పాటు టీచర్లు, ఆయాలు కూడా ఏకరూప దుస్తుల్లో దర్శనమివ్వనున్నారు. ఈ వినూత్న కార్యక్రమం దుస్తుల పంపిణీకే పరిమితం చేయకుండా కేంద్రాలను మరింత ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ చిన్నారులకు అందించే యూనిఫామ్‌కు అవసరమైన క్లాత్‌ను టెస్కో నుంచి జిల్లాకు చేరవేసినట్లు అధికారులు వెల్లడించారు. గతేడాది ఎంపిక చేసిన కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకే యూనిఫామ్ ఇవ్వగా.. ఈ ఏడాది అన్ని కేంద్రాలకు ఇవ్వనున్నారు.

క్రమశిక్షణకు దోహదం..

ఇప్పటివరకు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అమలులో ఉన్న యూనిఫామ్ విధానం ఇప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలకు విస్తరించింది. ఈ నిర్ణయం ద్వారా పిల్లల్లో చిన్నతనం నుంచే క్రమశిక్షణ, ఏకత్వం పెంపొందించేందుకు తోడ్పడుతుంది. చదువు పట్ల మరింత గౌరవం, బాధ్యతను పెంచుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాగే బయటి నుంచి ఎవరైనా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చినప్పుడు యూనిఫామ్ ధరించి ఉన్న పిల్లలను చూడగానే ఆ కేంద్రానికి ఒక గుర్తింపు, విలువ ఉన్నట్లు భావిస్తారు. ఇది ప్రభుత్వ అంగన్‌వాడీల పట్ల ప్రజలకు ఉన్న దృక్పథాన్ని కూడా మార్చే అవకాశం ఉంది.

ప్రతీ చిన్నారికి రెండు జతలు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పేరు నమోదు చేసుకున్న ప్రతి చిన్నారికి రెండు జతల యూనిఫామ్‌లను ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. ఇందుకోసం జిల్లాకు అవసరమైన క్లాత్ ఇప్పటికే టెస్కో నుంచి ఖమ్మం చేరుకుంది. త్వరలో ఈ క్లాత్‌ను స్థానిక టైలర్లకు అప్పగించి, యూనిఫామ్‌లు కుట్టించిన తర్వాత పంపిణీ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఈ క్లాత్ అంగన్‌వాడీల పర్యావరణ అనుకూల వాతావరణాన్ని సూచించేలా ఆకుపచ్చ, బూడిద రంగుల కలయికతో పూల డిజైన్‌లతో తయారుచేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులకు అందించనుండగా.. వారి మధ్య ఎలాంటి తారతమ్యాలు లేకుండా సమానత్వాన్ని పెంపొందించవచ్చు.

జిల్లాలో అంగన్‌వాడీల వివరాలు..

మొత్తం కేంద్రాలు	1,840
అంగన్‌వాడీ టీచర్లు	1,725
హెల్పర్లు	1,224
3 – 6 ఏళ్ల చిన్నారులు	31,860

టీచర్లకు, ఆయాలకు గుర్తింపు

ఈ పథకం కేవలం పిల్లలకే పరిమితం కాలేదు. అంగన్‌వాడీ కేంద్రాల విజయానికి మూలస్తంభాలుగా నిలిచే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకూ ప్రత్యేక గౌరవాన్ని ఇచ్చేలా ప్రభుత్వం రెండు జతల చీరలను అందించనున్నారు. టీచర్లకు ఆకుపచ్చ రంగు, ఆయాలకు నీలి రంగులో చీరలను అందించనున్నారు. దీంతో వారి పనికి ఒక ప్రొఫెషనల్ గుర్తింపు రావడంతో పాటు ఆత్మవిశ్వాసం పెరిగి వృత్తిపరమైన బాధ్యతలకు మరింతగా నిర్వర్తిస్తారు.

ప్రాథమిక విద్యా కేంద్రాలుగా..

ఈ చర్యలన్నీ అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం పోషకాహార పంపిణీ కేంద్రాలుగా కాకుండా, క్రమశిక్షణ, ప్రాథమిక విద్యా విలువలు నేర్పే సంస్థలుగా మార్చడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యం. అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్య, వసతులు కల్పిస్తే, ప్రైవేటు ప్రీ-స్కూళ్లకు వెళ్లలేని పిల్లలు ఇక్కడికి వస్తారు. ఈ యూనిఫామ్ పథకం అలాంటి మార్పుకు ఒక గొప్ప ప్రారంభం అని చెప్పవచ్చు. ఈ చర్యతో కేంద్రాలు భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా ఎదుగుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే యూనిఫామ్..



అంగన్‌వాడీల్లో చేరిన చిన్నారులకు త్వరలోనే యూనిఫామ్ అందజేయనున్నాం. ఇప్పటికే యూనిఫామ్ క్లాత్ జిల్లాకు చేరింది. టైలర్ల వద్ద కుట్టించి పంపిణీ చేస్తాం. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఒక్కొకరికి రెండు జతల చీరలను అందజేయనున్నాం.

– కె.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి

స్థానిక ఎన్నికలకు సహకరించాలి

ఖమ్మంసహకారనగర్: స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా గ్రామపంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రదర్శించిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30లోగా ఎంపీడీఓలకు సమర్పిస్తే 31న పరిష్కరించి సెప్టెంబర్ 2న వార్డుల వారిగా తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, వివిధ పార్టీల నాయకులు స్వర్ణ సుబ్బారావు, పసుమర్తి శ్రీనివాస్, మిట్టపల్లి కిషోర్, జి.విద్యాసాగర్‌రావు, వై.రాఘవరావు, బండి రావెలు, ఏ.గోపాల్‌రావు, ఎస్.రాజయ్య, బి.తిరుమలరావు, బెల్లం వేణుగోపాల్, బంక మల్లయ్య, కె.కరుణాకర్, ఎం.లహరి, ఎం.శ్రీనివాసరావు, ఎస్.నరసింహారావు, ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వైద్య శిబిరం పరిశీలన



వైరా: దివ్యాంగుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వైరా: దివ్యాంగ బాలబాలికల ఉపకరణాల గుర్తింపు కోసం వైరాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అలింకో సంస్థ సహకారంతో శుక్రవారం జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యాన ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పలు మండలాల నుంచి పద్దెమిదేళ్ల లోపు దివ్యాంగులు హాజరు కాగా వీరిని వైద్యాధికారులు పరీక్షించి కావాల్సిన ఉపకరణాలను గుర్తించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ డీఈఓ శ్రీజ పాల్గొని వైద్యులు, దివ్యాంగ తల్లిదండ్రులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మండలంలో పాఠశాలల వివరాలు, ఇప్పటి వరకు పంపిణీ చేసిన దుస్తులు, పుస్తకాల వివరాలను ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. వైరా ఎస్టీ కాలనీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి అందులోని సాంకేతిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నా రు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మాధవరా వు, సీఎంఓ ప్రవీణ్‌కుమార్, వైరా మండల స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన సాగులో మెళకువలు..



ఎంవీ.మధుసూదన్

ఖమ్మంవ్యవసాయం: కొద్దిరోజులుగా భారీ నుంచి అతి భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యాన ఉద్యాన పంటలను కాపాడుకునేలా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి ఎంవీ.మధుసూదన్ సూచించారు. ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి

పండ్ల తోటల్లో..

కొత్తగా నాటిన వివిధ రకాల పండ్ల మొక్కలను వెదురు కర్రలతో కట్టి గాలికి వంగిపోకుండా ఆధారం కల్పించాలి. గాలికి దెబ్బతిన్న /విరిగిపోయిన కొమ్మలను సీకేచర్‌తో కత్తిరించి చివరలకు సీఓసీ లేదా బోర్డో మిశ్రమం పూయాలి. సాధ్యమైనంత వరకు వర్షపు నీటిని 48గంటల కంటే ఎక్కువ సమయం చెట్ల చుట్టూ నిల్వకుండా చూడాలి. కాలువలు తీసి మురుగు నీరు తోట నుంచి బయటకు పోయే వసతి కల్పించాలి. చెట్టు చుట్టూ మట్టిని ఎగదోయడం వలన వేరుకుళ్లు నష్టాన్ని నివారించవచ్చు. ఒక శాతం పొటాషియం నైట్రేట్ లేదా రెండు శాతం యూరియా ద్రావణాన్ని 2–3 సార్లు వర్షాలు తగ్గిన తర్వాత పిచికారీ చేయాలి. వర్షాలు కురిసే సమయంలో ఎరువులు వేయరాదు. వర్షాలకు ఎరువులు తేలికగా భూమి లోపలి పొరలలోకి వెళ్లి చెట్లకు అందుబాటులో ఉండదు. వర్షం తగ్గగానే యూరియా లేదా మల్టీ ఏ 10 గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నత్రజనిని యూరియా రూపంలో కాకుండా అమ్మోనియా రూపంలో అందిస్తే ఎక్కువ నష్టం ఉండదు. మచ్చ తెగులు నివారణ కోసం తెగులు ఆశించిన కొమ్మలు, ఆకులను తీసివేసి కార్బన్డిజం 1గ్రా/లీ లేదా మాంకోజెబ్ 2 గ్రా/లీ పిచికారీ చేయాలి. అధిక వర్షాలకు జామలో ఎండు తెగులు అధికంగా వ్యాప్తి చెందుతుండగా.. నివారణకు 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి, 2 కిలోల ట్రైకోడెర్మావిరిడి అనే జీవ శిలీంద్రనాశిని కలిపి మొక్కలకు వేయాలి.



వర్షాలకు పండుబారిన తోటలో కీరదోస కాయలు కోస్తున్న రైతు

- **కూరగాయల పంటలు:** టమాట, వంకాయ, ఉల్లి, మిరప, బెండ, తీగ జాతి కూరగాయల పంటలకు సంబంధించి పొలంలో నిలిచిన నీటిని తీసివేయాలి. పంటపై 13–0–45 ఎరువు 5గ్రాములను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. అలాగే, మొక్కలకు మట్టిని ఎగదోయాలి. నిటారుగా పెరిగే మొక్కలకు ఊతమివ్వాలి. పది రోజుల వ్యవధిలో రెండు సార్లు యూరియా ద్రావణం 10 గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **మిరప:** మిరప పంటలో అధిక వర్షాల వల్ల నీళ్లు నిలిచి నారు కుళ్లు వచ్చే ప్రమాదం ఉంది. నివారణకు సీఓసీ 3 గ్రాములు, ప్లాంటోమైసిన్ 1 గ్రాములు 1లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- **ఆయిల్ పామ్:** నిలబడిన నీటిని మొక్క వేరు వ్యవస్థ దగ్గర ఉంచకుండా తోట నుంచి కాల్వ తయారుచేసి బయటకు పంపాలి. లేత తోటలలో ఆయిల్ పామ్ కార్బన్డిజం కాపర్ దాతు శిలీంద్ర నాశనిని పిచికారీ చేయాలి. వర్షాలు అనంతరం సిఫారసు చేయబడిన ఎరువులను అందించాలి. కోతకు తయారైన గెలలను వెంటనే మార్కెట్ చేయాలి.

పీఏసీఎస్‌ల ద్వారానే యూరియా అమ్మకం



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన సీపీ సునీల్‌దత్ తదితరులు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో ఇక నుంచి పీఏసీఎస్‌ల ద్వారానే రైతులకు యూరియా సరఫరా చేయనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కూసుమంచిలో శుక్రవారం సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ విషయమై సూచనలు చేశారు. దీంతో కూసుమంచి రైతు వేదికలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, పీఏసీఎస్‌ల డైరెక్టర్లు, ఉద్యోగులతో కలెక్టర్ చర్చించారు. నియోజకవర్గంలో యూరియా సరఫరా పూర్తిగా పీఏసీఎస్‌ల ద్వారా జరగాలని ఆదేశించారు. ఇవి కాక కూసుమంచి మండలంలో 14, ఖమ్మం రూరల్‌లో ఏడు, నేలకొండపల్లిలో రెండు, తిరుమలాయపాలెం మండలంలో పది ఉప కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేకాధికారులను నియమిస్తామని తెలిపారు. ప్రతీ 2,500 ఎకరాలకు ఒక కేంద్రాన్ని ఏర్పాటుచేసి పటిష్టంగా యూరియా సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఈసమావేశంలో డీఏఓ పుల్లయ్య, ఆర్డీఓ నర్సింహారావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఏడీఏ సతీష్, తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. అండర్–15 విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించి మాట్లాడుతూ జిల్లా నుంచి బ్యాడ్మింటన్ క్రీడలో ఎందరో ఉన్నత స్థాయికి చేరారని, ఈ వారసత్వాన్ని యువత కొనసాగించాలని సూచించారు. బ్యాడ్మింటన్ శిక్షణకు అన్ని వసతులు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏఎస్పీ జి.వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం మాట్లాడుతూ జిల్లా నుంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులను తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు. డీవైఎస్ఓ టి.సునీల్ రెడ్డి మాట్లాడగా కార్పొరేటర్ కమర్తపు మురళి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.చంద్రశేఖర్‌తో పాటు సిరిపురపు సుదర్శన్, పి.రవిమారుత్, పి.యుగంధర్, దుద్దుకూరి సత్యనారాయణ, జట్ల శ్రీను, కొంగర శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ క్వార్టర్‌కు చేరిన టోర్నీ

రాష్ట్రస్థాయి అండర్–15 బ్యాడ్మింటన్ పోటీలు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. బాలబాలికల నాకౌట్ పోటీలు శుక్రవారం రాత్రి పూర్తయ్యాయి. శనివారం నుంచి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

మాజీ ఉపసర్పంచ్ నిరసన

ట్రాక్టర్ కిస్తీ కట్టలేదని ఖాతా హోల్డ్



నిరసన తెలుపుతున్న రాజేశ్వరి, తదితరులు

మధిర: గ్రామపంచాయతీ ట్రాక్టర్ కిస్తీ బకాయి చెల్లించలేదనే నెపంతో తనవ్యక్తిగత ఖాతాను బ్యాంక్ అధికారులు హోల్డ్ చేశారంటూ ఓ మాజీ ఉపసర్పంచ్ మధిర మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి మందా సైదులు మాట్లాడుతూ.. తొండలగోపవరం జీపీకి ట్రాక్టర్ కొనుగోలు సమయాన ఆనాటి ఉపసర్పంచ్ చేబ్రోలు రాజేశ్వరి గ్యారంటీ సంతకం చేశారని చెప్పారు. పాలకవర్గాల గడువు ముగిశాక నిధులు రాకపోవడంతో ట్రాక్టర్ కిస్తీ తొమ్మిదినెలలు బకాయి ఉందని తెలిపారు. దీంతో రాజేశ్వరికి మధిర ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఉన్న వ్యక్తిగత ఖాతాను హోల్డ్‌లో చేశారని చెప్పారు. ఈ విషయమై అధికారులను సంప్రదిస్తే స్పందన రానందున ఉన్నతాధికారులైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మద్దాల ప్రభాకర్, ఎలిజాల గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఇటుకరాళ్ల చెరువు కట్ట



కట్ట కుంగిన చోట పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు/కల్లూరురూరల్: వరుస వర్షాలకు కల్లూరులోని ఇటుకరాళ్ల చెరువు కట్ట ప్రమాదకరంగా మారింది. చెరువు ప్రధాన తూము లీకేజీతో కట్ట భాగం మట్టి వదులుగా మారి ఐదు మీటర్ల పొడవునా కుంగింది. భారీ వర్షాలు వస్తే కట్టకు గండి పడేందుకు ప్రమా దం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది కూడా కట్ట కోతకు గురై గండి పడగా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మరోమారు అలాగే జరగడంతో శుక్రవారం జలవనరులశాఖ డీఈ రత్నాకర్, ఏఈ పరిశీలించారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, వేసవిలో శాశ్వత పనులు నిర్వహిస్తామని తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు అరెస్ట్

ఖమ్మంక్రైం: గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని మోమినాన్ ప్రాంతానికి చెందిన షేక్ అల్తాఫ్‌పాషా, రజాక్‌లు సీక్వెల్ సమీపాన అనుమానస్పదంగా కనిపించడంతో శుక్రవారం వారిని పోలీసులు పట్టుకున్నారు. తనిఖీ చేయగా.. వారి వద్ద నుంచి 60 గ్రాముల గంజాయి లభించింది. దీంతో వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



ఇటీవల ప్రారంభమైన నగరంలోని టూటౌన్, త్రీటౌన్ ప్రాంతాలను కలిపే రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)కి అప్పుడే లీకులు ఏర్పడ్డాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ప్రాణం తీసిన చేపల వేట

తిరుమలాయపాలెం: కూలీనాలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మండలంలోని జూపెడ గ్రామానికి చెందిన గుండ్లపల్లి సురేష్(46) శుక్రవారం చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సురేష్ భార్య గత కొద్ది సంవత్సరాల క్రితం చనిపోగా.. తల్లి వెంకటమ్మ వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు జూపెడ చెరువు నిండగా.. గ్రామంలోని కొందరు చేపల వేటకు వెళ్లారు. ఈ క్రమంలో సురేష్ కూడా చేపలు పట్టేందుకు చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. దీంతో చుట్టు పక్కల వారు తెప్పలు, బోట్ల సాయంతో గాలించి బయటకు తీసుకురాగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

తృటిలో తప్పిన ప్రమాదం



రోడ్డు మధ్యలో దిగబడిన లారీ

వైరా: వైరాలో శుక్రవారం ఓ లారీ పల్టీ కొట్టింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. వైరా నుంచి జగ్గయ్యపేట వెళ్లే రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఓ వైపు బీటీ వేస్తుండగా.. మరో వైపు రోడ్డు మట్టి తోలకాలు చేస్తున్నారు. ఈ నేపథ్యాన పనులు నిలిచిపోగా గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీరు నిలిచి మట్టిలో సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ దిగబడి ఓ పక్కకు ఒరిగింది. డ్రైవర్ చాకచక్యంతో వాహనాన్ని కిందపడకుండా అక్కడే నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.